రూ.190 ఆదా అవుతుంది



మాది ప్రకాశం జిల్లాలోని గిద్దలూరు. బద్వేలులో సొంత పని నిమిత్తం బస్సులో ప్రయాణం చేస్తున్నాను. బస్సు చార్జీ దాదాపు 95 రూపాయలు ఉంటుంది. ఆధార్‌కార్డు చూపించడంతో ఉచితంగా ప్రయాణం చేస్తున్నా. రాను పోను చార్జీలే రూ.190 ఆదా అవుతుంది. చంద్రబాబుకు మహిళలు రుణపడి ఉంటారు.

- మాబుచాన్, గిద్దలూరు

స్త్రీశక్తితో ఆర్థిక భరోసా





బస్సులో ఉచితంగా ప్రయాణిస్తున్న మహిళల హర్షం

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రెండు నెలల వ్యవధిలోనే వరుసగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అమలు చేసి.. సూపర్‌సిక్స్ పథకాలతో జనాల్లో జోష్ నింపారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించారు. జిల్లాలో 462 బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం కల్పించారు. రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చు. ఉచిత బస్సు సౌకర్యం మహిళలకు ఎంతగానో ఉపయోగపడనుంది. ఓ విధంగా ఇది ఆ కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇవ్వనుంది.

- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం
- విద్యార్థులు, కార్మికులు, పేద మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగం
- పెరగనున్న ఆర్టీసీ ఆక్యుపెన్సీ

(కడప-ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు ఆర్థికంగా భరోసా కల్పించనుంది. మహిళలు బంధువుల ఇళ్లకు వెళ్లాలన్నా, శుభకార్యాలు, ఇతర ఏ కార్యక్రమాలకు వెళ్లాలనుకున్నా ఉచితంగా ప్రయాణించవచ్చు. ఇక రోజువారి పనులు, ఉద్యోగాలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థినులు పాలు, కూరగాయలు, పండ్లు తీసుకువచ్చి పట్టణాల్లో అమ్ముకునే మహిళలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. కడప నగరంలో ఇటీవల పెద్ద పెద్ద షోరూంలు ఏర్పాటవుతున్నాయి. అలాగే నిర్మాణరంగం, హోటల్స్, ప్రైవేటు విద్యాసంస్థల్లో మహిళలు ఎక్కువగా పనిచేస్తున్నారు. వీరంతా ఇప్పటి దాకా బస్సుల్లో చార్జీ చెల్లించి రావాల్సి ఉంది. ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. వీరికి ఎంత తక్కువ వేసుకున్నా నెలకు కనీసం రూ.2,000 దాకా డబ్బు ఆదా కానుంది.

జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రాలున్నాయి. శ్రావణ మాసంలో గండి, దేవునికడప, బి.మఠంతో పలు పుణ్యక్షేత్రాలకు భక్తుల తాకిడి ఉంటుంది. ఇక వచ్చేది కార్తీకమాసం. ఆ నెలలో మహిళలు పుణ్యక్షేత్రాలకు తిరుగుతుంటారు. వీరందరికీ ఉచిత బస్సు వల్ల డబ్బులు ఆదా అవుతాయి. ఇక ప్రైవేటు విద్యాసంస్థలు, వ్యాపార సంస్థల్లో పనిచేసేవారికి జీతాలు అంతంత మాత్రమే ఉంటాయి. వారికి రవాణా చార్జీలు ఉచిత బస్సు రూపంలో మిగలనున్నాయి. ప్రస్తుతం ఆర్టీసీలో ఆక్యుపెన్సీ 72శాతం నమోదవుతోంది. ఉచిత బస్సు కావడంతో దాదాపు 90 శాతానికి పైగా ఆక్యుపెన్సీ ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. శుక్రవారమే స్త్రీశక్తి పథకం ప్రారంభమైంది. శనివారం, ఆదివారాలు వరుసగా సెలవులు రావడంతో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థలు మూతబడ్డాయి. దీంతో మహిళలు ఇంకా ప్రయాణం చేయలేదు. సోమవారం తరువాత మహిళల ప్రయాణాల సంఖ్య పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

హామీ నిలబెట్టుకున్నారు



చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటున్నారు. ఇప్పుడు ఆర్టీసీ బస్సుల్లో ఫ్రీ సౌకర్యం కల్పించారు. ఎక్కడికైనా తిరగవచ్చు. మా మనవడికి ఆరోగ్యం బాగాలేకుంటే కడప ఆసుపత్రిలో చూపించేందుకు వెళుతున్నా. ఉచిత బస్సు మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

- గంగమ్మ, గాంధీనగర్, బద్వేలు

కుటుంబ అవసరాలకు ఉపయోగపడతాయి



మాది పోరుమామిళ్ల మండలంలోని రామాయపల్లె. సొంత పని నిమిత్తం బద్వేలుకు వెళ్లి రావాల్సి ఉంది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో చార్జీ లేకుండానే ఉచితంగా ప్రయాణం చేసే సౌకర్యం అందు బాటులో ఉంది. ఈ బస్ చార్జీలు కుటుంబ అవసరాలకు ఉపయోగపడతాయి.

- ఆదిలక్ష్మి, రామాయపల్లె, పోరుమామిళ్ల

మహిళలకు గొప్పవరం



మాది బందరు. బ్రహ్మంగారిమఠం దర్శించుకోవాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. ఈరోజు దర్శనం చేసుకున్నాం. మైదుకూరు నుంచి శ్రీశైలం వెళుతున్నా. ఉచితబస్సులో ప్రయాణించినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. మహిలకు ఇది గొప్పవరం.

- రాగిణి, బందరు, ఎన్టీఆర్ క్రిష్ణాజిల్లా

మహిళలకు ఎంతో ఉపశమనం



ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వల్ల మాలాంటి మధ్యతరగతి కుటుంబాలకు మేలు చేస్తుంది. ఇప్పటి దాకా ఎక్కడికి వెళ్లాలన్నా చార్జీలు ఎక్కువగా ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదు.

- డి.స్వప్న, పైడికాల్వ, వల్లూరు మండలం

ఉచిత బస్సులో వచ్చాను



గండి క్షేత్రానికి వెళ్లేందుకు కడప నుంచి వేంపల్లె వరకు ఉచితంగా వచ్చాను. గండికి వెళ్తున్నాను. బస్సులో టికెట్ కోసం డబ్బు ఇవ్వలేదు. టికెట్ ఉచితంగా ఇచ్చారు. ఆధార్‌కార్డు ఒరిజినల్ చూపితేనే ఉచితం అవకాశం ఇస్తున్నారు. జిరాక్సు గాని, ఫోన్‌లో గాని చూపితే అవకాశం కల్పించాలి.

- సరోజమ్మ, భాగ్యనగర్ కాలనీ, కడప

ఉచిత బస్సులో రావడం సంతోషంగా ఉంది



నాది వేంపల్లె మండలం బక్కన్నగారిపల్లె గ్రామం. నేను మా ఊరి నుంచి వేంపల్లె వరకు ఉచిత బస్సులో వచ్చాను. గండి వీరాంజనేయస్వామిని దర్శించుకునేందుకు వెళ్తున్నా. ఉచిత బస్సులో రావడం సంతోషంగా ఉంది.

- చింతమ్మ, బక్కన్నగారిపల్లె గ్రామం, వేంపల్లె మండలం

కోస్ట్‌గార్డ్‌కు సీజీసీ మెడల్



సీజీసీ మెడల్‌కు ఎంపికైన రమణారెడ్డి

కలసపాడు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కలసపాడు మండలం కొండపేట గ్రామానికి చెందిన కోస్ట్‌గార్డ్ ఉద్యోగి ప్రతిష్ఠాత్మకమైన సీజీసీ మెడల్‌కు ఎంపికయ్యారు. కొండపేట గ్రామానికి చెందిన నారాయణరెడ్డి, వీరమ్మ దంపతుల కుమారుడు రమణారెడ్డి మూడేళ్లుగా ఇండియన్ కోస్ట్‌గార్డ్‌గా ముంబైలో పనిచేస్తున్నారు. విధుల్లో భాగంగా వీరు 2024లో సముద్రజలాల్లోని దేశ సరిహద్దులో పహరా కాస్తున్న సమయంలో మన దేశ జాలర్లు పాకిస్థాన్‌కు చిక్కారు. వారివద్ద నుంచి మనవారిని తిరిగి తీసుకురావడంలో మన కోస్ట్‌గార్డుల బృందం సాహసోపేతంగా పనిచేసింది. వీరి సేవలను గుర్తిస్తూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సీజీసీ మెడల్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రకటించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ మెడల్‌కు ఎంపికైన ఒకే వ్యక్తి రమణారెడ్డి కావడం విశేషం.

ఏపీఎస్పీడీసీఎల్ కడప జిల్లా శాఖకు ప్రథమస్థానం



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న జిల్లా విద్యుత్ అధికారి ఎస్.రమణ

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్పీడీసీఎల్ పరిధిలో గల 10 జిల్లాల్లో వివిధ అంశాలపై అత్యుత్తమ ప్రగతిని సాధించిన కడప జిల్లా ప్రథమస్థానానికి ఎంపికైంది. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని తిరుపతి కార్యాలయంలో జరిగిన వేడుకల్లో చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోష్‌రావు చేతులమీదుగా కడప జిల్లా విద్యుత్ అధికారి ఎస్.రమణ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. జిల్లా విద్యుత్ విభాగంలో విద్యుత్ ప్రమాదాల నివారణపై, వినియోగదారుల విద్యుత్ సమస్యలపై వాట్సప్ నెంబర్‌ద్వారా పరిష్కారంపై, ప్రజలకు సకాలంలో అందించే విద్యుత్ సేవలపై తదితర అంశాలపై స్వల్పకాలంలో ప్రగతిని పరుగులు పెట్టించిన ఎస్.రమణను ప్రశంసించారు.

తిరుపతి-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైలు

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి-సికింద్రాబాద్-తిరుపతిలకు కడప మీదుగా ప్రత్యేక రైలు (07097/07098) నడపనున్నట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎ.జనార్దన్ తెలిపారు. 17వ తేదీ ఆదివారం తిరుపతిలో రాత్రి 9:10నిమిషాలకు రైలు బయలుదేరుతుందన్నారు. రాత్రి 9.33 గంటలకు రేణిగుంట, 10:28గంటలకు రాజంపేట, 11:13గంటలకు కడప చేరుకుంటుందని చెప్పారు. రాత్రి 11:48గంటలకు ఎర్రగుంట్ల, తాడిపత్రికి అర్ధరాత్రి 12:38గంటలకు చేరుకుంటుంది. మంత్రాలయం, వికారాబాద్ మీదుగా సికింద్రాబాద్‌కు 18వ తేదీ ఉదయం 10గంటలకు వెళ్తుందన్నారు. ఈరైలు తిరుగు ప్రయాణంలో 18వ తేదీ సోమవారం సాయంత్రం 5:50గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి వికారాబాద్ మంత్రాలయం మీదుగా ఎర్రగుంట్లకు మరుసటి రోజు ఉదయం 3:13గంటలకు, కడపకు, 3:58గంటలకు, రాజంపేట 4:38గంటలకు చేరుకుని అదేరోజు ఉదయం 7:30గంటలకు తిరుపతి చేరుకోనుందన్నారు. ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు ఈ ప్రత్యేక రైలును వేసినట్లు తెలిపారు.

గండికి రూ.27.95లక్షల ఆదాయం

చక్రాయపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో శ్రావణమాసం 4వ శనివారం సందర్భంగా వివిధ సేవల ద్వారా రూ.27,95,721 ఆదాయం వచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య, ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. అలాగే గండిలో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలం జి.రెడ్డివారిపల్లె గ్రామానికి చెందిన జయరామయ్య ధర్మపత్ని రాయపాటి లక్ష్మీదేవి రూ.50,116 అందించినట్లు తెలిపారు.

మాయరోగం ఫట్

- 7577 పింఛన్ల నిలిపివేత
- కడప పట్టణంలోనే అత్యధికం
- సిద్దవటంలో అత్యల్పం

7

ప్రోటోకాల్ విధులు పక్కాగా నిర్వహించాలి

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రోటోకాల్ విధులను పక్కాగా నిర్వహించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా ప్రోటోకాల్ విధులపై సంబంధిత రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు కలెక్టర్‌కు వివరిస్తూ.. 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా కడప పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ప్రజాప్రతినిధులకు, అధికారులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, ప్రజలకు ప్రోటోకాల్ ప్రకారం సౌకర్యాలు కల్పించామన్నారు. కడపకు చెందిన ప్రజాప్రతినిధి వేడుకలు ప్రారంభమైన ఒకటిన్నర గంట తరువాత వేదిక వద్దకు వచ్చారన్నారు. అక్కడ వీఐపీలు, ప్రజాప్రతినిధులు కూర్చొనేందుకు గ్యాలరీ ఏర్పాటు చేశామన్నారు. ప్రజాప్రతినిధి తను ఆలస్యంగా వచ్చే విషయం ముందుగా అధికారులకు తెలియజేయలేదన్నారు. ప్రజాప్రతినిధికి కేటాయించిన సీటులో ఇతరులు కూర్చోవటం గమనించిన జిల్లా రెవెన్యూ అధికారి, ఇతర అధికారులు వారిని అక్కడ నుంచి పంపించారన్నారు. వెంటనే ప్రజాప్రతినిధిని ఆహ్వానించినా అక్కడ కూర్చొనేందుకు తను విముఖత వ్యక్తం చేశారన్నారు. దీంతో ప్రత్యేకంగా కుర్చీ ఏర్పాటుచేసి ఆహ్వానించామన్నారు. ముందుగా సీటు వేయలేదని వేదిక వద్ద నిలుచోవడంతో గమనించిన జాయింట్ కలెక్టర్ ప్రజాప్రతినిధి వద్దకు వచ్చి కూర్చోవాలని కోరారన్నారు. తదుపరి కలెక్టర్ స్వయంగా వెళ్లి ఆ ప్రజాప్రతినిధిని ఆహ్వానించినా వేదిక వద్దకు వెళ్లకుండా వెనుదిరిగి వెళ్లిపోయారన్నారు. ఈ సంఘటనపై ప్రోటోకాల్ విషయంలో ప్రజాప్రతినిధికి జరిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని జిల్లా రెవెన్యూ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రోటోకాల్ సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రోటోకాల్ మేరకు ప్రజాప్రతినిధులను గౌరవించాల్సిన బాధ్యత ఉందని స్పష్టం చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఇలాంటి సమస్యలను అధిగమించాలన్నారు.

ఆగని 'కుర్చీ'గోల

- అధికారులపై రుసరుసలు హేయం : రెవెన్యూ అధికారులు
- స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తాం : టీడీపీ జిల్లా అధ్యక్షుడు

7

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

7


ప్రమాదవశాత్తు కోనేటిలో పడి వ్యక్తి మృతి

7

భక్తులతో కిక్కిరిసిన గండి క్షేత్రం



గండి క్షేత్రంలో ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయస్వామి



గండి క్షేత్రంలో భక్తజన సందోహం



చక్రాయపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన గండి వీరాంజనేయస్వామి దేవస్థానం నాలుగవ శ్రావణ శనివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఎటుచూసినా భక్తులే. గండి దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మన్, ఉత్సవ కమిటీ సభ్యులు కల్లూరు వెంకటస్వామి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. అంజన్నను దాదాపు 80 నుంచి లక్ష మంది భక్తులు దర్శించుకున్నారు. స్పెషల్ దర్శనం, వీఐపీ దర్శనాల కోసం అదనంగా కౌంటర్లు ఏర్పాటు చేసినప్పటికీ భక్తులు గంటలకొద్దీ క్యూలైన్లలో నిలబడి ఉండాల్సి వచ్చింది. వచ్చిన భక్తుల కోసం దాదాపు 30వేల లడ్లు, 30వేల పులిహోరా ప్యాకెట్లను దేవస్థానం సిద్ధం చేసింది. వీటిని సీతారాముల గుడి వద్ద విశ్వనాథరెడ్డి, కె.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఇచ్చారు. వాసవి కల్యాణ నిత్యాన్నదాన సత్రంలో వేలాది మందికి అన్నదానం చేశారు. పలువురు భక్తులు సైతం అన్నదానం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ ఉలసయ్య, ఎస్ఐ రంగారావు, చంద్రశేఖర్‌తో పాటు 200 మంది పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.

వేడుకగా కృష్ణాష్టమి


శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ప్రొద్దుటూరు ఇస్కాన్ ఆధ్వర్యంలో అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో కృష్ణాష్టమిని శోభాయమానంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. ప్రొద్దుటూరు, బి.మఠంలోని వేణుగోపాలస్వామి ఆలయాల్లో స్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. కడప ద్వారకానగర్‌లోని కృష్ణాలయానికి శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు బారులుతీరారు. లింగాలలో శ్రీకృష్ణుడికి గ్రామోత్సవం వేడుకగా జరిగింది. జమ్మలమడుగులో భారీ కృష్ణుడి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.



కడప ద్వారకానగర్‌లో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు



కడప ద్వారకానగర్‌లోని శ్రీకృష్ణుడిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



బ్రహ్మంగారి మఠంలోని వేణుగోపాలస్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



ప్రొద్దుటూరు వేణుగోపాలస్వామి ఆలయం వద్ద భక్తులకు అన్నదానం

కట్టారు.. వదిలేశారు

- నిరుపయోగంగా రూ.2.68 కోట్ల భవనాలు
- పంచాయతీపై నెలకు అద్దెభారం రూ.60 వేలు
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా సచివాలయ భవనాలు
- పట్టించుకోని అధికారులు

కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన సచివాలయ భవనాలు అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారాయి. అరకొర వసతుల నడుమ అద్దె భవనాల్లో సచివాలయాలు నడుపుతున్నారు. పర్యవసానంగా పీలేరు మేజర్ గ్రామ పంచాయతీపై నెలకు రూ.60 వేల అద్దె భారం పడుతోంది.

పీలేరు రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో పీలేరు పట్టణంలో ఐదు గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేశారు. ఇందులో ఒకటవ సచివాలయం పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉంది. ఇదొక్కటే సొంత భవనంలో ఉంది. ఇందిరానగర్, జేకేనగర్, కడప రోడ్, కోటపల్లె మార్గంలో ఉన్న నాలుగు సచివాలయాలు అద్దెభవనాల్లో నిర్వహిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయ భవన నిర్మాణానికి రూ.45 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.22 లక్షలు మంజూరు చేశారు. పీలేరు పట్టణంలో నాలుగు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణం కోసం రూ.2.68 కోట్లు మంజూరయ్యాయి. క్రాంట్రాక్టులు దక్కించుకున్న నాలుగు సచివాలయాలకు గాను మూడింటి నిర్మాణం పూర్తిచేశారు. ఒక్కటి మాత్రం అర్ధంతరంగా ఆగిపోయింది.

పీలేరు పట్టణం కామాటంవారిపల్లె వద్ద సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రాలు పూర్తి స్థాయిలో నిర్మించారు. కాగా ఇందిరానగర్‌లో సచివాలయాన్ని తమ స్థలంలో నిర్మించారంటూ బాలికల ఉన్నత పాఠశాల కోర్టుకు వెళ్లి దానిని స్వాధీనం చేసుకుంది. అధికారుల అత్యుత్సాహం కారణంగానే నిర్మాణం పూర్తి చేసుకున్న భవనాన్ని పాఠశాలకు అప్పగించాల్సి వచ్చిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ రైతు భరోసా కేంద్ర నిర్మాణం సైతం సగంలో ఆగిపోయింది. పట్టణ నడిబొడ్డున ఉన్న సీఎల్‌ఆర్‌సీ కార్యాలయ సమీపంలో ఒక సచివాలయం, రైతుభరోసా కేంద్ర నిర్మాణం పూర్తి కాగా, మరో సచివాలయం, రైతు భరోసా కేంద్ర నిర్మాణాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. పీలేరు పంచాయతీ అధికారులు నిర్మాణం పూర్తయిన భవనాలను స్వాధీనం చేసుకున్నా ప్రారంభించడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండడంతో అవి నిరుపయోగంగా మారాయి. దీంతో నాలుగు సచివాలయాల అద్దె భారం పంచాయతీపై పడుతోంది. దీనికి తోడు నిర్మాణం పూర్తయిన భవనాలను వినియోగంలోకి తీసుకు రాకపోవడంతో ఇవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఇప్పటికైనా కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన భవనాలను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.



నిర్మాణం పూర్తయ్యాక ఇందిరాగనర్ బాలికోన్నత పాఠశాల స్వాధీనం చేసుకున్న సచివాలయ భవనం

త్వరలోనే ప్రారంభిస్తాం
- లతీఫ్ ఖాన్, ఇన్‌చార్జి ఈవో, పీలేరు



చిన్నిచిన్న పనులు పూర్తి చేయాల్సి ఉంది. అన్ని పనులు పూర్తి చేసి వీలైనంత త్వరగా సచివాలయ కొత్త భవనాలను ప్రారంభిస్తాం. పంచాయతీపై నెలనెలా మోయలేని అద్దె భారం పడుతోంది. నిర్మాణం పూర్తయిన భవనాలను పంచాయతీ స్వాధీనం చేసుకుంటుంది. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లతో సంప్రదించి పంచాయతీ ఆధీనంలోకి తీసుకుంటాం.





సీఎల్‌ఆర్‌సీ కార్యాలయం వద్ద నిర్మాణం పూర్తయిన సచివాలయ భవనం - ప్రారంభానికి సిద్ధంగా రైతు భరోసా కేంద్రం

పశు వైద్యాధికారికి రాష్ట్ర స్థాయి

ఉత్తమ సేవా పురస్కారం



ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకొంటున్న డాక్టర్ సురేశ్

నిమ్మనపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పశు సంవర్ధక శాఖలో పశు వైద్యులుగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ సురేశ్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి అత్యధికంగా పెయ్యదూడల కృత్రిమ గర్భధారణ ప్రోత్సహించినందుకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా గుంటూరులో జరిగిన సమావేశంలో రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు నుంచి అవార్డు అందుకున్నానని తెలిపారు. అయితే ఇదే ఏడాదిలో 780 పెయ్యదూడలకు కృత్రిమ గర్భధారణను ప్రోత్సహించామని దీని ద్వారా 90 శాతం ఆవులలో ఎలాంటి సమస్య లేకుండా పెయ్యదూడలు మాత్రమే పుడతాయని తెలిపారు. గత ప్రభుత్వంలో కృత్రిమ గర్భధారణకు ఉపయోగించే సూదిమందు రూ.500 ఉండగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దానిని రూ.150కే ఇస్తోందని తెలిపారు. దీంతో అధిక శాతం పాడి రైతులు పెయ్యదూడల సూది కొరకు ముందుకు వస్తున్నట్లు తెలిపారు.

కోళ్లబైలులో ఆక్రమణలు తొలగింపు



ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోళ్లబైలు గ్రామం, అమ్మ చెరువు మిట్టలో శనివారం రెవెన్యూ అధికారులు ఆక్రమణలను తొలగించారు. ఇందులో ఎటువంటి అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి తన సిబ్బందితో వెళ్లి అక్రమ కట్టడాలను నేలమట్టం చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండల పరిధిలో అక్రమ కట్టడాలు, నిర్మాణాలు చేపడితే రెవెన్యూ అధికారులు తొలగించి చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోళ్లబైలులో పలు చోట్ల పునాదులను, కట్టడాలను పరిశీలించారు. ఇందులో ఆర్‌ఐ బాలసుబ్రహ్మణ్యం, మండల సర్వేయర్ సుబ్రమణ్యం, వీర్వోలు పాల్గొన్నారు.

జాతీయ జెండాతో ర్యాలీ నేరమా?

హెడ్ కానిస్టేబుల్‌పై కూటమి నాయకుల ఫిర్యాదు



ఎస్‌ఐకు ఫిర్యాదు చేస్తున్న కూటమి నాయకులు

సుండుపల్లె, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం రోజు జాతీయ జెండాతో ర్యాలీ పట్టుకోవాలంటే అనుమతులు తీసుకోవాలా అని బీజేపీ మండల అధ్యక్షుడు రమణగౌడ్, జనసేన సీనియర్ నాయకుడు రామాశ్రీనివాసులు ప్రశ్నించారు. శుక్రవారం ర్యాలీని అడ్డుకున్న హెడ్ కానిస్టేబుల్ సాదక్‌అలీ తీరును తీవ్రంగా ఖండించారు.

హర్ ఘర్ తిరంగా పేరుతో దేశ ప్రధాని నరేంద్రమోదీ ఊరూవాడా ర్యాలీలు నిర్వహించి దేశఖ్యాతిని చాటుతుంటే జెండాకు సెల్యూట్ కొట్టాల్సిన హెడ్ కానిస్టేబుల్ ర్యాలీని అడ్డుకొని అనుమతులు ఉన్నాయా అని అడగడం సిగ్గుచేటన్నారు. అలాంటి వ్యక్తిని విధుల నుంచి తొలగించి కేసు నమోదు చేయాలని సుండుపల్లె ఎస్‌ఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రమణగౌడ్, జనసేన సీనియర్ నాయకులు రామాశ్రీనివాసులు, టీడీపీ నాయకులు ఎర్రంరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్బరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాచరాయుడు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిచర్ల శంకరయ్య, ఉపాధ్యక్షులు రెడ్డెయ్యఆచారి, గాలి భాస్కర్, సుధాకర్, చంద్రమోహన్, శ్రీనివాసరాజు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పెన్నాలో చేపల వేటకు వెళ్లొద్దు : సీఐ



సిద్దవటంలోని పెన్నానది వద్ద సీఐ బాబు

సిద్దవటం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : పెన్నానదిలో నీటి ప్రవాహం రోజురోజుకు పెరుగుతోందని, మత్స్యకారులు నదిలో చేపల వేటకు వెళ్లవద్దని ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపారు. శనివారం ఆయన సిద్దవటం వద్ద పెన్నానదిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల పెన్నానదిలో నీటి ఉధృతి పెరుగుతోందని ప్రజలతో పాటు సందర్శకులు ఎవరూ నదిలో దిగవద్దని తెలిపారు. లోలెవల్ లోకాజ్‌వే వద్ద ఎవరైనా సంచరిస్తే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పెన్నానదిలో నీటి మట్టం తగ్గేవరకు ఇద్దరు పోలీసులను బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, పెన్నానది వద్ద ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే సమాచారం తెలపాలని మండల వాసులకు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కొండయ్య, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి మృతి



గుర్తు తెలియని యువకుడి మృతదేహం

మదనపల్లె అర్బన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీటీఎం గ్రామం, రైల్వే బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. శనివారం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు తాలుకా పోలీసులకు సమాచారం అందించారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ మృతదేహాన్ని పరిశీలించి కదిరి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి గుర్తుతెలియని యువకుడిగా నిర్ధారించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని కదిరి రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కదిరికి తరలించినట్లు తెలిపారు.

హిల్స్‌లో సందడే.. సందడి

బి.కొత్తకోట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ శనివారం పర్యాటకులతో కిటకిటలాడింది. సహజంగా వారాంతంలో పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. దానికి తోడు కృష్ణాష్టమి నేపథ్యంలో వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో హార్సిలీహిల్స్‌కు పర్యాటకులు పోటెత్తారు. కుటుంబ సమేతంగా హిల్స్‌కు చేరుకొని ఉల్లాసంగా గడిపారు. గాలిబండ, పాత, కొత్త వ్యూపాయింట్స్, అటవీశాఖ ప్రాంగణంలో కలియతిరుగుతూ, మానస సరోవరంలో బోటింగ్ చేస్తూ సరదాగా గడిపారు. సముద్రమట్టానికి 4212 అడుగుల ఎత్తులో చల్లని, ఆహ్లాదకర వాతావరణంలో కలిగే సరికొత్త అనుభూతిని ఆస్వాదిస్తూ తన్మయత్వం చెందారు. పెద్దసంఖ్యలో పర్యాటకులు తరలిరావడంతో ఏపీ టూరిజం, అటవీ సముదాయంతో పాటు ప్రైవేటు గెస్ట్‌హౌస్‌లు పూర్తిగా నిండిపోయాయి.



మానస సరోవరంలో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

విషపురుగు కాటుకు రైతు మృతి



వెంకటయ్య మృతదేహం

సిద్దవటం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : నీరు కట్టేందుకు పొలానికి వెళితే విషపురుగు కుట్టడంతో రైతు వెంకటయ్య (40) మృతి చెందాడు. మండలంలోని వెలుగుపల్లె గ్రామానికి చెందిన వెంకటయ్య గ్రామానికి పడమటి భాగంలో ఉన్న తన పొలంలో వరి పంట సాగు చేశాడు. శనివారం ఉదయం పొలానికి నీరు కట్టేందుకు ఉదయం 6 గంటలకు పొలంలోకి వెళ్లాడు. పొలానికి నీరు కడుతుండగా విషపురుగు కుట్టడంతో పొలం పక్కనే ఉన్న రైతు వెంగయ్యకు చెప్పడంతో ద్విచక్ర వాహనంలో భాకరాపేట గ్రామంలోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యసేవల కోసం కడప రిమ్స్‌కు ఆటోలో తీసుకెళ్లగా అక్కడి వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. వెంకటయ్య భార్య వెంకటసుబ్బమ్మ, కుమార్తె ఉన్నారు. పంటల ఖర్చుల నిమిత్తం సుమారు రూ.2 లక్షలు పైబడి అప్పు చేశాడని, రాష్ట్ర ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని మృతుడివి భార్య కన్నీటిపర్యంతమైంది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చేసినట్లు ఏఎస్‌ఐ సుబ్బరామచంద్ర తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్ రవి

రాయచోటి (నేతాజీ సర్కిల్), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని కూరగాయల మార్కెట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవి వ్యాపారులకు తెలిపారు. ఆయన మార్కెట్ పరిసర ప్రాంతాలను శనివారం పరిశీలించారు. వ్యాపారులతోకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మార్కెట్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడానికి చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మార్కెట్‌లో ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తప్పవని వ్యాపారులను హెచ్చరించారు. ప్రజలు మార్కెట్‌కు వచ్చేటప్పుడు విధిగా గుడ్డ సంచి లేదా జూట్ బ్యాగ్ వెంట తెచ్చుకోవాలని తెలియజేశారు. పట్టణ పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ తమవంతు సహకరించాలని ప్రజలకు వివరించారు. రాయచోటి పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా చేయడానికి ప్రజల సహకారం ఎంతైనా అవసరం అన్నారు. వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు వాడరాదని తెలియజేశారు. మార్కెట్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా లేకపోతే రోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఆ..రెండూ అందని ద్రాక్షేనా...?

- ఆర్టీసీ డిపో అదిగో..ఇదిగో మాటలకే సరి...
- డిగ్రీ కాలేజీదీ.. అదే తీరు...
- దశాబ్దాలుగా ఊరిస్తున్న ఆ రెండూ...



ఇళ్లకు వెళ్లేందుకు బస్సులు లేక వేచి ఉన్న విద్యార్థులు

బి.కొత్తకోట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణం తంబళ్లపల్లె నియోజకవర్గంలో ప్రధానమైనది. జనాభా 40 వేలకు పైనే. పొరుగు మండలాలైన పీటీఎం, ములకలచెరువులతో పాటు సరిహద్దు కర్ణాటక గ్రామాల ప్రజలతో కనెక్టివిటీతో చాలా రద్దీగా ఉండే పట్టణం. మేజర్ పంచాయతీగా ఉంటూ నగర పంచాయతీగా ప్రమోట్ అయిన పట్టణం. బి.కొత్తకోట నుంచి మదనపల్లి, కదిరితో పాటు కర్ణాటక రాజధాని బెంగళూరు వైపు వందలమంది ప్రయాణాలు సాగిస్తుంటారు. అదే విధంగా పొరుగు మండలాలు, చుట్టుపక్కల గ్రామాల నుంచి వందల సంఖ్యలో విద్యార్థులు ఎల్‌కేజీ నుంచి డిగ్రీ వరకు చదువుకునేందుకు, రైతులు కొనుగోళ్లు, అమ్మకాలకు నిత్యం బి.కొత్తకోటకు వచ్చి తీరాల్సిందే. ఇలాంటి ప్రధాన పట్టణానికి తలమానికంగా ఉన్న ఆర్టీసీ డిపో రద్దు చేసి దశాబ్దం దాటింది. డిగ్రీ కాలేజి వచ్చేస్తోందంటూ పాలకులు నమ్మబలికి దశాబ్దం కావస్తోంది. ఈ రెండింటిపై ఆశలు వదులుకోలేక బి.కొత్తకోట ప్రజానీకంతో పాటు ఈ పట్టణంతో కనెక్టివిటీ ఉన్న 300 గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు.

డిగ్రీ కాలేజి వచ్చేసిందంటూ మాయమాటలు..

బి.కొత్తకోటకు అత్యవసరమైన వాటిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజి ఒకటి. కొత్తకోట నుంచే కాకుండా పీటీఎం, ములకలచెరువు మండలాల నుంచి వందల సంఖ్యలో డిగ్రీ విద్యార్థులు బి.కొత్తకోటలో చదువుతున్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజి లేక ప్రైవేటు కాలేజిలలో చేరారు. వీరి నుంచి ఓ వైపు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూపంలో మరోవైపు ప్రైవేటు కాలేజిల యాజమాన్యాలు దోచేస్తున్నాయి. పట్టణంలో మూడు ప్రైవేటు డిగ్రీ కాలేజిలు ఉండగా అధికారులు సైతం వీరికి సహకరిస్తున్నారు. డిగ్రీ కాలేజి ఏర్పాటు చేయండి అని ప్రజాసంఘాలు, విద్యార్థుల తల్లితండ్రులు మొరపెట్టుకుంటున్నా ఆలకించే నాయకులు కరువయ్యారు. డిగ్రీ కాలేజి ఏర్పాటుకు కొన్నిసార్లు ప్రయత్నాలు జరిగినా అందులో చిత్తశుద్ధి లోపించి అర్ధంతరంగా ఆగిపోయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి 2013లో బి.కొత్తకోటలోనే జరిగిన బహిరంగసభలో డిగ్రీ కాలేజి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. బెంగళూరు రోడ్డులో శంకరయ్యస్వామి ట్రస్ట్ భూమిలో నూతన నిర్మాణం అన్నారు. అమలు కాలేదు. మరోసారి స్థానికంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజి భవనాలలో తాత్కాలికంగా డిగ్రీ తరగతులు సైతం ప్రారంభిస్తామని చెప్పినా అదీ జరగలేదు.

కలగా మారిన ఆర్టీసీ డిపో

బి.కొత్తకోట పట్టణానికి అభివృద్ధి పరంగా ఆర్టీసీ డిపో కీలకమైంది. మదనపల్లె ఎమ్మెల్యేగా ఉన్న ఆవుల మోహన్‌రెడ్డి ఆర్టీసీ డిపోను తెచ్చారు. 2006 డిసెంబరు 31న అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 14 డిపోలను రద్దు చేశారు. అందులో బి.కొత్తకోట ఒకటి. వాటిలో స్థానిక ప్రజాప్రతినిధుల కృషితో అంచెలంచెలుగా 13 డిపోలు మళ్లీ ప్రారంభమవ్వగా బి.కొత్తకోటకు మాత్రం దిక్కులేకుండా పోయింది. డిపో సాధన కోసం ప్రజాసంఘాలు, స్థానిక నాయకుల కృషి ఫలించలేదు. అప్పటి నుంచి అధికారంలోకి వచ్చిన పార్టీ, లోకల్ ఎమ్మెల్యే అదిగో..ఇదిగో అనడం తప్ప కార్యరూపం దాల్చింది లేదు. ఒకటికి రెండుసార్లు స్థలాలు ఎంపిక చేయడం, బి.కొత్తకోట లోగోతో బస్సులను నడపటం, అధికారులను పిలిపించి హడావిడి చేయడం తప్ప డిపో వచ్చింది లేదు. గతంలో డిపో ఏర్పాటుకు భూమి ఇస్తామన్న పాపానికి ఓ కుటుంబం చిక్కుల్లో పడింది. తాజాగా వైసీపీ హయాం చరమాంకంలో గంగమ్మ మాన్యంలో డిపో ఏర్పాటు చేసేస్తున్నారని, బస్సులు కూడా వచ్చేస్తాయని ప్రచారం మాత్రమే జరిగింది. గ్రామాల నుంచి బి.కొత్తకోటకు రావడానికి, సాయంత్రం తిరిగి వెళ్లడానికి విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు.



ఆర్టీసీ డిపో కోసం ఎంపిక చేసిన స్థలంలో నిర్మించిన షెడ్డు

నాయకులు చొరవ చూపాలి..

రాష్ట్రంలో రద్దయిన ఆర్టీసీ డిపోలన్నీ మళ్లీ ప్రారంభమయ్యాయి. ఇక్కడి నాయకులకు సాధించాలన్న పట్టుదల లేకపోగా ఎవరి స్వార్థం వారిది. ప్రజాసమస్యలు, పట్టణ అభివృద్ధిపై అంకితభావం లేదు. కూటమి ప్రభుత్వంలోనైనా ఆర్టీసీ డిపో, డిగ్రీ కాలేజిల సాధనకు అధికార పార్టీ నాయకులు కృషి చేయాలి. ఆ ప్రయత్నాలకు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుంది.

- మనోహర్‌రెడ్డి, బి.కొత్తకోట

యువతి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న పవిత్ర (ఫైల్ ఫొటో)

ప్రొద్దుటూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని పాతికేళ్ల యువతి ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన శనివారం ప్రొద్దుటూరులోని స్వరాజ్యనగర్‌లో చోటు చేసుకుంది. ఆ వివరాల్లోకి వెళితే... ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని స్వరాజ్యనగర్‌కు చెందిన పల్లోలి జయమ్మ, రవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కూతురు సౌజన్యకు పెళ్లయింది. రెండో కూతురు పవిత్ర ఎంటెక్ పూర్తి చేసి వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తోంది. దువ్వూరు మండలం ఇడమడక గ్రామానికి చెందిన తన బంధువుల అబ్బాయి ధారా వినోద్‌కుమార్‌ను ప్రేమించింది. వీరి ప్రేమను పవిత్ర తల్లిదండ్రులు అంగీకరించారు. వచ్చే సంవత్సరం పెళ్లి కూడా చేయాలని అనుకున్నారు. రోజు మాదిరిగానే శుక్రవారం ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా కాలేజీకి వెళ్లి 10.30 గంటలకు తిరిగి ఇంటికి వచ్చింది. సాయంత్రం 6 గంటలకు ఇంటిపైన వున్న రేకుల గదికి వెళ్లింది. రాత్రి 8 గంటలు అవుతున్నా కిందికి రాకపోవడంతో తల్లి వెళ్లి ఎంత గట్టిగా తలుపు కొట్టినా పలకకపోవడంతో కిటికిలో నుంచి చూసింది. పవిత్ర చీరతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించడంతో జయమ్మ గట్టిగా కేకలు వేసింది. దీంతో జయమ్మ భర్త, పెద్ద కూతురు, చుట్టుపక్కల వారు పైకి వచ్చి తలుపు పగలగొట్టి పవిత్రను కిందకు దించారు. వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించిందని వైద్యులు తెలిపారు. తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ సదాశివయ్య కేసు నమోదు చేశారు,

ప్రమాదవశాత్తు కోనేటిలో పడి వ్యక్తి మృతి


క్రిష్ణయ్య మృతదేహం

సింహాద్రిపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని భానుకోట శైవ క్షేత్రంలో కటిక పెద్ద క్రిష్ణయ్య(54) శనివారం ప్రమాదవశాత్తు కోనేటిలో పడి మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం జంగంపల్లి గ్రామానికి చెందిన క్రిష్ణయ్య భానుకోటకు వెళ్తున్నట్లు భార్య గంగమ్మకు చెప్పి శుక్రవారం ఇంటినుండి వచ్చాడు, తిరిగి రాత్రి ఇంటికి రాకపోవడంతో భార్య గంగమ్మ ఆందోళనకు గురైంది. పోలీసులకు అందిన సమాచారం మేరకు క్రిష్ణయ్య భానుకోటలో ప్రమాదవశాత్తు కోనేటిలో పడినట్లు మృతి చెందినట్లు తెలిసింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పులివెందుల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


గుండం నుంచి వెలికితీసిన హబీబుల్లా మృతదేహం


హబీబుల్లా ఫైల్‌ఫొటో

అట్లూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని లంకమల క్షేత్రంలో లంకమల్లేశ్వరుని పక్కనే ఉన్న పసుపు గుండంలో ఈత కొడుతూ గల్లంతైన హబీబుల్లా మృతదేహం లభించినట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు... శుక్రవారం రాత్రి పొద్దుపోయే వరకు గాలించినా హబీబుల్లా మృతదేహం లభ్యం కాకపోవడంతో శనివారం ఉదయమే పోలీసు, ఫైర్ సిబ్బంది గుండమంతా గాలించి 30 అడుగుల లోతులో ఉన్న హబీబుల్లా మృతదేహాన్ని మధ్యాహ్నం 3గంటల వరకు శ్రమించి వెలికితీశారని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారని, మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ గాలింపు చర్యల్లో ఫైర్ ఆఫీసరు చంద్రుడు, పోలీసు సిబ్బంది నాగేశ్వర్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టరు రమణ తదితరుల పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక పిల్ల మృతి

వల్లూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వల్లూరులో శనివారం జరిగిన కుక్కల దాడిలో జింక పిల్ల మృతి చెందినట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. గ్రామ పొలాల్లో సంచరిస్తూ వల్లూరు గ్రామం చుట్టూ ఉన్న కుక్కలు దాడి చేయడంతో జింక పిల్ల మృతి చెందిందన్నారు. ఈ విషయంపై పోలీసులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. దీంతో చనిపోయిన జింక పిల్లకు పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు.


మృతి చెందిన జింక పిల్ల

మాయరోగం ఫట్




జిల్లాలో ఉన్న బోగస్ సదరం సర్టిఫికెట్లను వైద్యాధికారులు గుర్తించారు. అంగవైకల్యం ధ్రువీకరణ కోసం వికలత్వపు పింఛన్లు పొందుతున్న లబ్దిదారులకు దశల వారీగా నోటీసులు జారీ చేసి వైద్యపరీక్షలు నిర్వహించారు. కొంతమంది వైద్య పరీక్షలకు హాజరు కాగా మరి కొంతమంది గైర్హాజరయ్యారు. తిరిగి వారికి వైద్య పరీక్షల తేదీని ఖరారు చేస్తూ నోటీసులు జారీ చేశారు. ఎట్టకేలకు అనర్హులను ప్రభుత్వం గుర్తించింది. దీంతో జిల్లాలో 7577 పింఛన్లను నిలుపుదల చేస్తూ చర్యలు తీసుకుంది. పలు మార్లు పింఛన్ల కోసం మాయ రోగం అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో అధికారులు సదరం సర్టిఫికెట్లపై నిఘా ఉంచారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇబ్బడిముబ్బడిగా వైకల్య పింఛన్లు మంజూరయ్యాయి. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో ఉన్న వైకల్య పింఛన్ల కంటే వైసీపీ హయాంలో అత్యధికంగా పెరిగాయి.

- 7577 పింఛన్ల నిలిపివేత
- కడప పట్టణంలోనే అత్యధికం
- సిద్దవటంలో అత్యల్పం

కడప ఎన్జీఆర్ సర్కిల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన వ్యక్తులు ఇతర జిల్లాల్లో ఉన్న ఆసుపత్రులలో వైకల్య సర్టిఫికేట్ పొందారు. ఈ సర్టిఫికేట్ల ఆధారంగా దివ్యాంగులకు ఇచ్చే పింఛన్లు పొందేవారు. వీటిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలో ముందుగా ఇతర జిల్లాల్లో ఇచ్చిన వికలత్వ సర్టిఫికేట్లను పరిశీలించారు. ఈ పరిశీలనలో అత్యధికంగా వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించే పులివెందుల నియోజకవర్గంలోనే ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు .ఈ మేరకు 232 బోగస్ వైకల్య సర్టిఫికెట్లను రద్దు చేశారు. వీటితో పాటు ఆ తర్వాత చేపట్టిన సర్టిఫికేట్ల నిర్ధారణలో 1087 మందికి నకిలీ సర్టిఫికేట్లుగా గుర్తించడం జరిగింది. వీటిలో అత్యధికంగా పోరుమామిళ్ల మండలంలో 69, కలసపాడులో 68, ఎర్రగుంట్ల 60, ముద్దనూరు 57, కమలాపురం 51, మైదుకూరు 50, తొండూరు 42, పులివెందుల 22, వివిధ మండలాల్లో పదికి పైగానే సదరం సర్టిఫికేట్లను బోగస్‌గా గుర్తించారు. ఈ మేరకు గత ఏడాది సెప్టెంబరు నెలలో వీరి పింఛన్లను రద్దు చేయాలంటూ అప్పటి కలెక్టరు శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు.

మరో 7577 పింఛన్లు రద్దు

ఆ తరువాత చేపట్టిన అంగ వైకల్య ధృవపత్రాల పరిశీలనలో మరో 7577 మంది తమకు ఎలాంటి వికలత్వం లేకున్నప్పటికీ కేవలం పింఛన్ల కోసమే సదరం సర్టిఫికేట్లు పొందారని వైద్యాధికారులు గుర్తించారు. వీరిలో 4581 మందికి 40 శాతం తక్కువ వికలత్వం ఉన్నట్లు, 74 మందికి 45శాతం కంటే ఎక్కువ ఉన్నట్లు గుర్తించారు. ఇక ఇతర అనారోగ్య సమస్యల కారణంగా పొందిన 2022 సర్టిఫికేట్లను నకిలీవిగా అంటే ఎటువంటి వికలత్వం లేకుండా వైద్యాధికారుల నుంచి పొందినటు గుర్తించారు. ఈ క్రమంలో జిల్లాలో మొత్తం 7577పింఛన్లను నిలుపుదల చేయాలంటూ ఉత్తర్వులు జారీ అయినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికార యంత్రాంగం పేర్కొన్నారు. ఇందులో కడప పట్టణంలో 558 పింఛ్లు రద్దయిన జాబితాలో ఉండగా ఇది అత్యధిక స్థానంలో ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అదే విధంగా వేంపల్లె మండలంలో 529, అట్లూరులో 67, బి.కోడూరులో 120, బద్వేలులో 81, బద్వేలు పట్టణ ప్రాంతంలో 115, బి.మఠంలో 127, చక్రాయపేటలో 204, చాపాడులో 210, చెన్నూరు మండలంలో 102, సీకేదిన్నెలో 156, దువ్వూరులో 246, గోపవరంలో 65, జమ్మలమడుగు మండలంలో 86, మున్సిపాలిటీ పరిధిలో 79, కలసపాడులో 117, కమలాపురంలో 227, ఖాజీపేటలో 117, కొండాపురం 301, లింగాల 439, ముద్దనూరులో 297, మైలవరంలో 115, పెద్దముడియం 248, పోరుమామిళ్ల 119, ప్రొద్దుటూరు మండలంలో 221, మున్సిపాలిటీ పరిధిలో 202 బోగస్ పత్రాలున్నట్లు గుర్తించారు. అదేవిధంగా పులివెందులలో 121, మున్సిపాలిటీ ఏరియాలో 748, రాజుపాలెం 89, మైదుకూరులో 133, మున్సిపాలిటీ పరిధిలో 132, కాశినాయన మండలంలో 114, సిద్దవటంలో 50, సింహాద్రిపురంలో 201, తొండూరులో 301, వల్లూరు మండలంలో 86, వీఎన్‌పల్లె మండలంలో 202, వేంపల్లెలో 529, వేములలో 165, ఒంటిమిట్టలో 72, ఎర్రగుంట్లలో 122, మున్సిపాలిటీ పరిధిలో 60 వికలత్వ పింఛన్లను రద్దు చేస్తున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.



ఈనెల నుంచే పింఛన్ల నిలుపుదల..



రద్దయిన వికలత్వ పింఛన్లను ఈ నెల నుంచే నిలుపుదల చేయడం జరుగుతుంది. ఈ జాబితాలో అనర్హులుగా తేలినవారు ఎవరైనా మరోమారు తమ వికలత్వాన్ని నిరూపించుకునేందుకు అవకాశం ఉంటుంది. అలాంటి వారు ఎవరైనా ఉంటే వైద్యాధికారులను సంప్రదించాలి.

- డాక్టర్ జి.రాజ్యలక్ష్మి, ప్రాజెక్టు డైరెక్టరు, డీఆర్‌డీఏ

చెరువులకు సాగునీరు విడుదల

బి.కోడూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లోయర్ సగిలేరు ప్రాజెక్టు నుంచి బి.కోడూరు మండలంలోని 36 చెరువులను నింపుతూ బద్వేలు పెద్ద చెరువుకు శనివారం టీడీపీ ఇన్‌చార్జి రితీష్‌కుమార్‌రెడ్డి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నీటిసంఘాల చైర్మన్‌ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారని, అత్యవసర చెరువులకు సాగునీరు అందించేందుకు జీవోలతో సంబంధం లేకుండా నీటిని విడుదల చేయాలని చెప్పారని, కావున బద్వేలు నియోజకవర్గంలోని పోరుమామిళ్ల పెద్ద చెరువు, బద్వేలు పెద్ద చెరువులతో పాటు బి.కోడూరు మండలంలోని 36 చెరువులను నింపి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. రైతులు కూడా నీటిని వృథా చేయకుండా వాడుకోవాలని ఆయన సూచించారు. గత ప్రభుత్వంలో రూ.70 కోట్ల నిధుల లోయరు సగిలేరు ప్రాజెక్టుకు మంజూరైతే కేవలం ఎల్ఎస్‌పీ డ్యాం నుంచి బద్వేలు పెద్ద చెరువు వరకు కాల్వ మట్టి పని మాత్రమే చేసి బిల్లులు స్వాహా చేశారని ఆరోపించారు. కనీసం చెరువులకు షట్టర్లు కూడా బిగించలేదని, వారందరిపై అధికారులు చర్యలు తీసుకుని పనులు వేగవంతం చేస్తే రైతులకు మేలు చేసిన వారమవుతామన్నారు. అలాగే బద్వేలు పెద్దచెరువు నుంచి ఎల్ఎస్‌పీ డ్యాం వరకు కాల్వకు లైనింగ్ పనులు చేపట్టి పూర్తి చేస్తామన్నారు. అలాగే ఎల్ఎస్‌పీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఈగ రమణారెడ్డి మాట్లాడుతూ బద్వేలు పెద్దచెరువుకు త్వరగా సాగునీరు అందించాలంటే పోరుమామిళ్ల చెరువు నుంచి గుండంరాజపల్లె బ్రాంచ్ కెనాల్ ద్వారా సులభతరమవుతుందని తెలిపారు. బద్వేలు ప్రాంత ప్రజలకు సాగునీరు పూర్తిగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, మేకవారిపల్లె, మున్నెల్లి నీటిసంఘం చైర్మన్‌లు వెంకటసుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వెంకరటమణరెడ్డి, గోడి రమణారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు భాస్కరరెడ్డి, పవన్, సర్పంచ్ గురయ్య తదితరులు పాల్గొన్నారు.




ఎల్ఎస్‌పీ నుంచి నీటిని విడుదల చేస్తున్న రితీష్‌కుమార్‌రెడ్డి.. కాలువలో పారుతున్న నీరు

ఉపాధి హామీ పీడీపై చర్యలు తీసుకోవాలి

- ఫీల్డు అసిస్టెంట్ల ఫిర్యాదు

కడప మారుతీనగర్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఇబ్బందులకు గురి చేస్తున్న ఉపాధి హామీపథకం పీడీపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జె.శివ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో కడపలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 19 ఏళ్లుగా ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామీణ ప్రజలు వలసలు పోకుండా వారికి ఉపాధి కల్పిస్తూ పథకాన్ని సజావుగా అమలు చేస్తున్నామన్నారు. అటు కూలీలు, ఇటు అధికారులకు వారధిగా ఉంటూ చాలీచాలని వేతనాలతో జీవనాన్ని సాగదీస్తున్నామన్నారు. ప్రస్తుత పీడీ తమను అన్యాయంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జాబ్‌కార్డులను నెపంగా చూపి ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడం బాధాకరమన్నారు. ఈ విషయంగా కలెక్టరు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు చెన్నక్రిష్ణారెడ్డి, బయారెడ్డి, వెంకటసుబ్బమ్మ, సుదర్శన్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు

వెల్లాల చెన్నకేశవుడికి శంకుచక్ర తిరునామాలు


శంకుచక్ర తిరునామాలను అందిస్తున్న దృశ్యం

రాజుపాలెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): చెన్నకేశవ సంజీవరాయ స్వామివారికి శంకుచక్ర తిరునామాలను పెద్దముడియం మండలం పెద్దపసుపులకు చెందిన కిశోర్‌రెడ్డి శనివారం దేవస్థానానికి అందించారు. సుమారు రూ.లక్ష విలువ చేసే ఈ శంకు చక్ర తిరునామాలను రెండు జతలు తయారు చేసి భక్తిశ్రద్ధలతో వెల్లాల దేవస్థానానికి అందించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈవో, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మినారాయణరెడ్డి, రమణ దాతకు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అలాగే చెన్నకేశవస్వామి ఆలయ పునర్నిర్మాణానికి దాతలు విరళాలు అందించారు. రాజేపాలెం మండలం గోపాయపల్లెకు చెందిన సుంకు విశ్వనాథరెడ్డి రూ.లక్ష, అదే గ్రామానికి చెందిన దుద్యాల ఆదినారాయణరెడ్డి రూ.25వేలు, గంగిరెడ్డి రామక్రిష్ణారెడ్డి రూ.25వేలు, నంద్యాలకు చెందిన కందూరి సాంబమూర్తి రూ.లక్ష, ప్రకాశం జిల్లా కొమరోలుకు చెందిన బి.సుబ్బమ్మ రూ.50వేలు అందించారు. అనంతరం దాతలను స్వామివారి శేష వస్త్రం, మెమెంటోతో ఆలయ సిబ్బంది సత్కరించారు. శ్రావణమాసం సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి సంజీరవరాయ గ్రామోత్సవం భక్త జనం సంకీర్తనల మధ్య వైభవంగా సాగింది.

8 మంది జూదరుల అరెస్టు

వీరబల్లి, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గడికోట పంచాయతీ తువ్వ హరిజనవాడ సమీపంలో కంపచెట్ల మధ్య జూదం ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నరసింహారెడ్డి తెలిపారు. వారి వద్ద రూ.4,370 స్వాధీనం చేసుకు న్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మహిళపై దాడి.. ఏడుగురిపై కేసు

కొండాపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఎంఆర్ కాలనీలో రాధ అనే మహిళపై దాడి చేసినందుకు పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేశారు. డబ్బుల విషయంలో రంగస్వామి మరో ఆరుగురితో కలిసి దూషించి, దాడి చేసినట్లు రాధ, ఆమె భర్త ప్రతాప్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

ఆగని 'కుర్చీ'గోల

- అధికారులపై రుసరుసలు హేయం..
- రెవెన్యూ అధికారులు
- స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తాం..
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు



(కడప-ఆంధ్రజ్యోతి): కడపలో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కుర్చీ విషయమై ఎమ్మెల్యే, రెవెన్యూ అధికారుల మధ్య మొదలైన వివాదం కొనసాగుతోంది. జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌పట్ల కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి ప్రవర్తన జిల్లాకే అవమానకరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ నాయకులు, వైఎస్సార్ కడప జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు, ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ అసోసియేషన్ కడప జిల్లా నాయకులు చంద్రశేఖర్ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆర్.మాధవి, ఆమె భర్త శ్రీనివాసరెడ్డి పేర్లను నేరుగా చెప్పకుండా పరోక్షంగా ప్రస్తావించారు. ఈ ఘటనపై కలెక్టరు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కాగా.. "ప్రోటోకాల్ విషయంలో ఎమ్మెల్యే రాష్ట్ర ప్రధాన కార్యదర్శికంటే ఎగువస్థానంలో ఉంటారు. ఇది రెవెన్యూ సంఘం తెలుసుకోవాలి. అధికారులకే హక్కులు ఉండవు. ఎన్నికైన ప్రజాప్రతినిధులకు కూడా హక్కులుంటాయి. ఎమ్మెల్యే మాధవిపై తప్పుడు కథనాలతో పత్రికా ప్రకటనలు ఇవ్వడాన్ని మేం ఖండిస్తూ హక్కుల ఉల్లంఘనకు సంబంధించి స్పీకరుకు ఫిర్యాదు చేయనున్నాం" అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు మాత్రమే ప్రజాసేవకులు కాదు. ప్రజల చేత ఎన్నుకోబడిన విషయాన్ని రెవెన్యూ సంఘం గుర్తించాలని తెలిపారు. అక్కడ జరిగేది అధికారుల గెట్ టు గెదర్ లేదా వారి కుటుంబ సభ్యుల కార్యక్రమం కాదని పేర్కొన్నారు.

పాలకొండలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ఏటూరు రామచంద్రారెడ్డి

సీకేదిన్నె, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివార్లలోని పాలకొండ్రాయుడుస్వామి సన్నిధిలో నాలుగవ శనివారం సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. పవిత్ర శ్రావణమాసం సందర్భంగా ప్రతి శనివారం బాలాజీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి శనివారం పాలకొండ్రాయుడుస్వామి పాదాల చెంత అన్నదానం నిర్వహించడం గత కొన్నేళ్లుగాఆనవాయితీగా జరుగుతోంది. ఇందులో భాగంగా శనివారం నాలుగవ శనివారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఏటూరు రామచంద్రారెడ్డి, ట్రస్టు సభ్యులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

అంజన్నను దర్శించుకున్న బీటెక్ రవి దంపతులు



అంజన్న హారతులు అందుకుంటున్న బీటెక్ రవి, జడ్పీటీసీ లతారెడ్డి

చక్రాయపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా నాలుగో శ్రావణ శనివారం గండి వీరాంజనేయస్వామి దేవస్థానాన్ని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) ఆయన సతీమణి పులివందుల జడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి దర్శించుకున్నారు. శనివారం ఆయన కుటుంబ సభ్యులతో అంజన్న దర్శనానికి రాగా సహాయ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు కల్లూరు వెంకటస్వామి, ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్ వారికి స్వాగతం పలికి ఘనంగా పూజలు నిర్వహించారు. వారి వెంట గ్రంథాలయ మాజీచైర్మన్ మునిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశప్రగతికి పాటుపడిన ప్రధాని వాజ్‌పేయి



వాజ్‌పేయి విగ్రహానికి పూలమాల వేస్తున్న కందుల మురళీమోహన్‌రెడ్డి

కడప మారుతీనగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రగతికి పాటుపడిన ప్రధానుల్లో ముందు వరుసలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి నిలుస్తారని బీజేపీ నాయకులు కందుల మురళీ మోహన్‌రెడ్డి కొనియాడారు. వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక ఎన్జీవో కాలనీలో ఉన్న వాజ్‌పేయి సర్కిల్‌లో ఉన్న వాజ్‌పేయీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులుశ్రీనాథరెడ్డి, సీనియర్ నాయకులు గోసుల శ్రీనివాసులరెడ్డి, బీజేవైఎం నాయకులు చాగలమర్రి ఓబులేసు, బత్తల పవన్, ప్రవీణ్‌నాయుడు, సురేంద్ర,లక్ష్మణరావు , బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

వీరపునాయునిపల్లె, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలులో జరిగే సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు. శనివారం సీపీఐ మండల సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వరాయసాగర్ ప్రాజెక్టు ఉన్నప్పటికీ రైతాంగానికి సాగునీరు అందించలేకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి నాగేశ్వరరావు, మండల నాయకులు హరిహరనాథ, బ్రహ్మం, గంగయ్య, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

గండి ఆంజనేయస్వామి దర్శనానికి పాదయాత్ర

కమలాపురం రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దచెప్పలి గ్రామానికి చెందిన జనసేన నాయకులు, నాలుగో శ్రావణ శనివారం సందర్భంగా గండి వీరాంజనేయస్వామి దర్శనానికి ఏఎంసీ డైరెక్టరు రాము సిద్ధు ఆధ్వర్యంలో శనివారం ఉదయం పాదయాత్రగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో జన సైనికులు కుమార్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సురేంద్ర, సిసింద్రి, సుమన్, తేజ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

కమలాపురం రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమి సందర్భంగా నగర పంచాయతీ పరిధిలోని శ్రీరాధాక్రిష్ణ ఆలయంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం స్థానిక రైల్వేగేట్ సమీపంలోని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తానరసింహారెడ్డి కుటుంబ సభ్యులు కట్టించిన శ్రీరాధాక్రిష్ణ ఆలయంలో వేడుకలను ఆయన కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీరాధాక్రిష్ణ విగ్రహాలను పూలతో సుందరంగా అలంకరించారు. ఉదయం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, సరళమ్మ దంపతులు ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి, చైతన్య దంపతులు పండితులు నిర్వహించిన హోమాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఉదయం ఎమ్మెల్యే బండలాగుడు పోటీలు నిర్వహించారు. అదే విధంగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేశారు. కృష్ణుడి వేషధారణలో వచ్చిన పిల్లలకు బహుమతులు అందజేశారు. అదే విధంగా ఉట్టి కొట్టే కార్యక్రమం లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కాగా మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వాసుదేవరెడ్డి, ఖాదర్‌బాషా, దివాకర్‌రెడ్డి, కంకర సుబ్బారెడ్డి, రాఘవరెడ్డి, జంపాల నరసింహారెడ్డి, మల్లేశ్వరరాయల్, ప్రసాదరెడ్డి, చెన్నక్రిష్ణారెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చెన్నూరు..: కృష్ణాష్టమి వేడుకలు మండల వ్యాప్తంగా కన్నులపండువగా జరిగాయి, స్థానిక సీతారామలక్ష్మణ సంకీర్తన క్షేత్రం ప్రాంగణంలోని కృష్ణాలయంలో రాధాక్రిష్ణులకు తెల్లవారుజామునే సుప్రభాతసేవ, అభిషేకాలు, విష్ణు సహస్ర నామ పారాయణం, గోవింద నామా లు నిర్వహించారు. మధ్యాహ్నం ప్రసాద వితరణ తో పాటు సాయంత్రం రాధాక్రిష్ణులకు ప్రత్యేక పూల అలంకరణ గావించారు. అలాగే నాలుగో శ్రావణ శనివారం సందర్భంగా స్థానిక ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలోమూలవిరాట్ మూర్తికి ప్రత్యేక అభిషేకాలు, పూజలతో పాటు విశేష అలంకరణ గావించారు. అలాగే సాయంత్రం 7గంటలకు ఆలయ ప్రాంగణంలో గరుడ సేవ నిర్వహించారు.

కడప కల్చరల్..: కృష్ణాష్టమి పర్వదిన సందర్భంగా అంతర్జాతీయ క్రిష్ణచైతన్య సంఘం (ఇస్కాన్) కడప శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక భాగ్యనగర్ కాలనీ అష్టలక్ష్మి కళ్యాణమండపంలో జన్మాష్టమి వేడకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 5గంటలకు స్వామివారికి మంగళ హారతితో వేడుకలు ప్రారంభ మయ్యాయి, బలరామక్రిష్ణుడుప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఇందులో మహామంత్రధ్యానం, గోపూజ, కలశాభిషేకం, భోగ హారతి నిర్వహించారు. పలువురు చిన్నారులు చిన్నికృష్ణులు వేషధారణలో వేణుగానం, నెమలి ఈకలు అభరణాలుగా ధరించి సందడి చేశారు. వీరితో పాటు అమ్మాయిలను గోపికమ్మల వేషధా రణలో అలరించారు. సాయంత్రం 4గంటలకు ఉట్టికొట్టు కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. సాయంత్రం భరతనాట్యం, హరికథ, మహాశంఖా భిషేకం, 108 వంటకాల భోగ నివేదన నిర్వహించారు.





కమలాపురంలో పూజలు చేస్తున్న పుత్తాకుటుంబ సభ్యులు, కడపలో క్రిష్ణాష్టమి వేడుకల్లో భక్తులు

కార్యక్రమంలో ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు మాధవ దర్శన్‌దాస్ ప్రభు పాల్గొన్నారు. అనంతరం వేషధారణలో వచ్చిన చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

సీకేదిన్నె..: మండలంలో కృష్ణాష్టమి వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహించారు. మండలంలోని అప్పరాజుపల్లెలో అమర్‌నాథ్‌యాదవ్ ఆధ్వర్యంలో క్రిష్ణాష్టమి వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహించి భక్తులకు అన్నదానం, భజన కార్యక్రమాలను నిర్వహించారు. బొగ్గులపల్లె శ్రీకృష్ణాలయంలో ఊటుకూరు వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం నిర్వహించి భక్తులకు అన్నదానం, గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల గోపిక, కృష్ణుడు వేషధారణలో అందరినీ అలరించారు.

లింగాల..: మండలంలోని రామనూతలపల్లె గ్రామంలో శనివారం గ్రామస్థులు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చిన్నపిల్లలు శ్రీకృష్ణ, గోపిక వేషధారణతో అలరించారు. ఉట్టికొట్టు కార్యక్రమంలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కోలాటం నడుమ స్వామివారిని గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

వేంపల్లె..: వేంపల్లెలోని వడ్డెవీధిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమం వేడుకగా సాగింది. పెద్దఎత్తున భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.



ఊటుకూరు వేణుగోపాలస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



కమలాపురంలో బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి

అన్నదానం..: గండికి వెళ్లే భక్తులకు మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. గండికి వెళ్లే భక్తులకు కుమ్మరాంపల్లె సమీపంలో ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఆ సంస్థచైర్మన్ చక్రపాణిరెడ్డి, అధ్యక్షుడు యోగీశ్వర్ బాబు, డాక్టర్ రంగయ్య, రాజారామ్ పాల్గొన్నారు.





లింగాలలో కృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు, వేంపల్లిలో అన్నదానం చేస్తున్న మానవత ప్రతినిధులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

వేంపల్లె, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలనిసీఐ నరసింహాలు సూచించారు. వేంపల్లెలోని పలు ప్రధాన రహదారుల్లో వెళ్తున్న వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రికార్డులు ఉంచుకోవాలని సూచించారు.

యోగివేమన ఆర్కిటెక్ యూనివర్సిటీలో ఖాళీ పోస్టులు భర్తీ చేయండి



లోకేశ్‌తో పుత్తా లక్ష్మీరెడ్డి

(కడప - ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీ ఆర్కిటెక్ యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని మంత్రి నారాలోకేశ్‌ను టీడీపీ నేత పుత్తాలక్ష్మీరెడ్డి కలిసి విజ్ఞప్తిచేశారు. శనివారం ఉండవల్లిలో మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. యువగళం పాదయాత్రలో రూపొందించిన పుస్తకాన్ని లక్ష్మీరెడ్డి లోకేశ్‌కు అందించారు.

వీఆర్‌ఏలకు జీతాలు పెంచాలి



మాట్లాడుతున్న వీఆర్‌ఏల రాష్ట్ర అధ్యక్షుడు సాహెబ్

కడప సెవెన్ రోడ్స్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ఏడు సంవత్సరాలుగా వీఆర్‌ఏలకు జీతాలు పెంచలేదని, వెంటనే పెంచకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని వీఆర్‌ఏ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బందిగి సాహెబ్ హెచ్చరించారు. వీఆర్‌ఏల జిల్లా విస్తృత సమావేశం యూటీఎఫ్ కార్యాలయంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ ఏడు సంవత్సరాలుగా వీఆర్‌ఏలకు వేతనాలు పెరగకపోవడం దారుణమన్నారు. పెంచకపోగా,డీఏలు కూడా కట్ చేయడం దారుణమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారంలోకి వచ్చిన వెంటనే వేతనాలు పెంచుతామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. ఇంత వరకు హామీ నిలబెట్టుకోలేదన్నారు. ఈ నెలాఖరులో రాష్ట్ర వ్యాప్తంగా రిలే దీక్షలు, చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ ,యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండాలి

డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి

కడప కలెక్టరేట్,ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): దొంగ ఓట్ల సంస్కృతి పూర్తిగా పోవాలంటే ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండాలనీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేశారు. శనివారం నగరంలో కాంగ్రెస్ నాయకులు జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేపట్టిన ఓట్ చోరీ కార్యక్రమం దేశ ప్రజలందరూ స్వాగతించాలన్నారు. ప్రతి మనిషికి ఒకే ఓటు ఉండడం వల్లపాలకులను నిష్పక్షపాతంగా ఎన్నుకోవచ్చన్నారు. ఈకార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి అలీఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యిద్ గౌస్ పీర్, నియోజకవర్గ ఇన్‌చార్జులు ధ్రువ కుమార్ రెడ్డి, శివమోహన్ రెడ్డి, ఇర్ఫాన్, తదితర నేతలు పాల్గొన్నారు.

దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్త పడాలి

వేముల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్త పడాలని వైద్యసిబ్బంది ప్రజలకు సూచించారు. శనివారం మండలంలోని బచ్చయ్యగారిపల్లె, మల్లాపురం గ్రామాలలో ఇంటింటికి లార్వా, ఫీవర్ సర్వే నిర్వహించారు. అనంతరం నీటినిల్వలలో అబేట్ పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఎస్(ఎం) రమేష్, హెల్త్ అసిస్టెంట్‌లు శ్రీనివాసరావు, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ మాసోత్సవాలు





పైడికాల్వలో ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవస్వామి, పుష్పగిరికొండపై కోలాటం

వల్లూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శనివారం పురస్కరించకుకుని మండల పరిధిలోని పలు ఆలయాలు శ్రావణమాస ఉత్సవాలను నిర్వహించారు. అందులో భాగంగానే పుష్పగిరి క్షేత్రంలో ఉన్న చెన్నకేశవస్వామి రాజ్యలక్ష్మీ అమ్మవారు సంతాన మల్లేశ్వరుడు, వైద్యనాథేశ్వర కామాక్షి అమ్మవారికి విశేష అభిషేకాలు, పూజలు చేశారు. క్రిష్ణాష్టమి సందర్భంగా కొండపై కోలాటం ఆనందోత్సాహాల మధ్య పాటలతో సాగింది. శనివారం సందర్భంగా శివకేశవులను దర్శించుకునేందుకు వచ్చారు. అలాగే పైడికాల్వక్షేత్రంలో ఉన్న రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవాలయంలో రాహుకాల అభిషేకాన్ని విశేషంగా నిర్వహించారు.

వీర పునాయునిపల్లె..: వీర పునాయునిపల్లెలోని అభయాంజనేయస్వామి ఆలయంలో నాలుగో శ్రావణ శనివారం సందర్భంగా వేడుకలు ఘనంగా జరిగాయి. ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో భక్తులు పురోహితులచే హోమం చేయించారు. భక్తులకు ఆలయ చైర్మన్ ఒంటిగారి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు దాతల ఆర్థిక సహాయంతో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం సాయంత్రం ఐదు గంటల నుంచి వీరాంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని గుర్రపు బండిలో ఉంచి ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రసాదరెడ్డి, పలువురు దాతలు, ఎంపీటీసీ రాఘవ, ప్రసాదరెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సీకేదిన్నె..: శ్రావణమాసం శనివారం సందర్భంగా నాగిరెడ్డిపల్లె ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం కోలాటం నిర్వహించి భక్తులకు కనువిందు చేశారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

చక్రాయపేట..: శ్రావణ శనివారం పురస్కరించుకొని రాయచోటి-వేంపల్లె మెయిన్ రోడ్డు సమీపంలో వెలసిన దశరథ మహారాజుస్వామి ఆలయంలో దాదాపు 2వేల మందికి అన్నదానకార్యక్రమం నిర్వహించినట్లు దశరథ మహారాజుస్వామి ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. తాళంభజన, వాల్మీక రామాయణ పారాయణం జరిగింది. చిన్నమోరయ్య పల్లె నీలం వెంకటరెడ్డి,రామలక్షుమ్మ, వారి కుమారులు చలపతిరెడ్డి, మహేష్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులు, ఆలయ ధర్మకర్త సోమురామసుబ్బయ్య, మాజీ సర్పంచు సానె సుబ్బరామయ్య, కువైట్ సిద్దయ్య, సోము పెద్ద సిద్దయ్య, మేడిశెట్టి రెడ్డయ్య, భక్తులు పాల్గొన్నారు.





వీరపునాయునిపల్లెలో ఆంజనేయస్వామి గ్రామోత్సవం, చక్రాయపేట...దశరథ మహారాజస్వామి ఆలయంలో అన్నదానం

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు


ప్రొద్దుటూరులో అలంకరణలో వేణుగోపాలస్వామి


ప్రొద్దుటూరు శ్రీకృష్ణాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి


బద్వేలులో శ్రీకృష్ణ జన్మాష్టమి పూజా కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ప్రొద్దుటూరులోని శ్రీకృష్ణాలయంలో భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచి వేణుగోపాలస్వామికి పంచామృతాభిషేకం, గోక్షీరాభిషేకం నిర్వహించి నూతన పట్టువస్త్రాలు, వెండి కవచాలు, రంగు రంగుల పూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించి కాయాకర్పూరం సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కుకున్నారు. మధ్యాహ్నం భారీగా వచ్చిన భక్తులకు టీటీడీకల్యాణ మండపం ఆవరణలో అన్నప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణుని ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి రథంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ ఆలయంలో స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కృష్ణాలయం యాదవ సంఘం ఆధ్వర్యంలో యాదవ వైద్యులు డాక్టర్ నాగార్జున, డాక్టర్ సత్యరంగయ్యలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యాదవ సేవా సంఘం అధ్యక్షుడు దాసరి బాలసుబ్బరాయుడు యాదవ్, కార్యదర్శి ఆర్.వెంకటరమణయాదవ్, కోశాధికారి ఆర్.వెంకటయ్యయాదవ్, ఆలయ మాజీ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్‌యాదవ్, వ్యవస్థాపక అధ్యక్షుడు నాలి క్రిష్టారెడ్డియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన మహిళల కోలాట పోటీలు

శ్రీకృష్ణ జన్మాష్టమిని పురష్కరించుకుని మండల పరిధిలోని నంగనూరు ప్రసన్న వేణుగోపాలస్వామి ఆలయంలో ఉన్న గోసంరక్షణ శాలలో మహిళల కోలాట నృత్య పోటీలు ఉత్సాహంగా సాగడమేకాక భక్తులను అలరించాయి. ఈ పోటీల్లో వాసవీక్లబ్ సిరిపురం ఆధ్వర్యంలో వాసవీ కోలాట బృందం ప్రథమ బహుమతి గెలుచుకుంది. వారికి నిర్వాహకులు రూ.12,500 నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున, వివేకానందసేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ సోమా లక్ష్మీనరసయ్య, మల్లికార్జునరావు, వంకదార వీరభద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో వేడుకలు

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఇస్కాన్ ఆధ్వర్యంలో అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో శోభాయమానంగా నిర్వహించారు. శనివారం ఉదయం ఇస్కాన్ కేంద్రంలో శ్రీకృష్ణ బలరాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి సుందరంగా అలంకరించారు. హరినామ సంకీర్తన, భక్తిగీతాలాపనలు చేసి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో కృష్ణ బలరాముల ఉత్సవ మూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. 108 రకాల వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం హరినామ సంకీర్తన, క్రిష్ణలీలా ప్రవచనం, రాత్రి 7 గంటలకు గౌర హారతి, భగవద్గీత ప్రవచనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కుచేలవధ నాటకం ఆకట్టుకుంది. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులందరికి వెన్నలడ్డూను ప్రసాదంగా అందజేశారు. రాత్రి కృష్ణ బలరాముల విగ్రహాలకు మహాశంకాభిషేకం, మహాపుష్పాభిషేకం, మహాహారతి ఇచ్చి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులతో అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానం కోలాలహలంగా మారింది. సాయంత్రం 5 గంటల నుంచి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి దాదాపు 40 వేల మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఇస్కాన్ ప్రతినిధులు మదురేసుదాసు, నిరంజన్, గోవిందదాసు, భక్తులు పాల్గొన్నారు.

వేణుగోపాలుడికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండల పరిధిలోని కామనూరులో ఉన్న శ్రీ ప్రసన్న వేణుగోపాలస్వామి ఆలయంలోని వేణుగోపాలస్వామికి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కృష్ణాష్టమి సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు నిర్వాహకులు స్వాగతం పలికారు. తదనంతరం గోశాలలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని గోవులకు ఆహారం తినిపించారు. ఈ కార్యక్రమంలో పట్టణ వ్యాపార సంస్థల సమాఖ్య అధ్యక్షుడు భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బద్వేలులో: మున్సిపాలిటీ పరిధిలోని అనంతగిరి క్షేత్రం శ్రీకృష్ణ గీతా మందిరంలో కృష్ణాష్టమి వేడుకలను నివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త యానకి పెంచలయ్య, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బోవిళ్ల సుబ్బారెడ్డి సభ్యుల ఆధ్వర్యంలో కన్నుల పండుగవగా రుక్మిణి, శ్రీకృష్ణుని కల్యాణోత్సవం నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణం తిలకించారు. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సెక్రటరీ నంద గోపాల్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకట సుబ్బారెడ్డి సభ్యులు పాల్గొన్నారు.

ముద్దనూరులో: స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో కొలువై ఉన్న శ్రీకృష్ణ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణతోపాటు స్వామి వారికి ఇష్టమైన అటుకులు,బెల్లంతో పాటు ప్రసాదాలు సమర్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.ఆలయ నిర్వాహకులు స్వామి వారికి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కొండాపురంలో: మండలంలో శ్రీకృష్ణాష్టమిని శనివారం వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వ హించారు. చిన్నారులతో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు

జమ్మలమడుగులో: జమ్మలమడుగులో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక త్రైత సిద్ధాంతం జమ్మలమడుగు శాఖ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేనేత విభాగం రాష్ట్ర బీసీ ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, ఏపీహెచ్‌డీసీ మాజీ చైర్‌పర్సన్ బడిగించాల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు పూజకు వచ్చిన ప్రతి ఒక్కరికి భగవద్గీతను అందించారు. ఈ కార్యక్రమంలో రంగనాయకులు, శిలివేరి శివ పాల్గొన్నారు.

దువ్వూరులో: దువ్వూరులో శనివారం కృష్ణాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక ఆలయంలో శ్రీకృష్ణున్ని అలంకరించి పూజలు నిర్వహించారు. చల్లబసాయిపల్లె వద్దనున్న గోశాల వద్ద బాలికలు కోలాటం నృత్యాలు నిర్వహించారు. కార్యక్రమాలు పలువురిని కనువిందు చేశాయి. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సోదరుడు రాఘవరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.


వేణుగోపాలస్వామి కల్యాణం

రాజుపాలెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అతి పురాతనమైన అర్కటవేములలో వెలసిన వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం కృష్ణాష్టమి సందర్భంగా స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యక ఆసనంపై ఆశీనులను చేసి కల్యాణ క్రతువు నిర్వహించారు. అదే విధంగా టంగుటూరులోని మదన గోపాలస్వామి ఆయలంలో ప్రత్యేక పూజలు చేశారు.

బ్రహ్మంగారిమఠంలో: మండలంలోని సిద్దయ్యగారిమఠంలో వెలసియున్న వేణుగోపాలస్వామి దేవాలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం మల్లేపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ లక్ష్మిదేవి, . బిమఠం మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, యువ నాయకుడు కాణాల మల్లిఖార్జునరెడ్డి, బిమఠం సహకార సంఘం చైర్మన్ సాంబశివారెడ్డి, తదితరులు వేణు గోపాలస్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమం అలరించియింది. రాత్రి వేణుగోపాలస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. సర్పంచ్‌లు మునిరెడ్డి, లక్ష్మిదేవి, రమణయ్య, నారాయణ, నాగరాజు, సిద్దయ్య, సిద్దయ్యమఠం స్వాములు రామక్రిష్ణ, సిద్దయ్య పాల్గొన్నారు.

కలసపాడులో: కలసపాడులోని శ్రీకృష్ణ మందిరంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమాల్లో భాగంగా గణపతి పూజ, శ్రీకృష్ణునికి అభిషేకం, భగవద్గీత పారాయణం, అష్టోత్తరం, మహమంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భారీగా తరలివచ్చిన భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సుదర్శన్, గౌరవాధ్యక్షుడు నాగరాజ, ప్రధాన కార్యదర్శి నారాయణ, వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు సత్యవతమ్మ, భక్తులు పాల్గొన్నారు.


జమ్మలమడుగులో శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని పూజలు చేస్తున్న భక్తులు



ప్రొద్దుటూరు ఇస్కాన్ ఆధ్వర్యంలో బలరామకృష్ణులు


ముద్దనూరులో శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని శ్రీకృష్ణ మందిరంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి ప్రకటించాలి

పోరుమామిళ్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐదు డీఏలు, మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌ఏ సత్తార్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఏపీటీఎఫ్ రీజియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఐదు డీఏలను జాప్యం లేకుండా వెంటనే ప్రకటించాలన్నారు. మధ్యంతర భృతి ప్రకటించకుండా ప్రభుత్వం కాలయాపన చేయడంసరికదన్నారు. 30శాతం ఐఆర్ కావాలని 2022 నుంచి పీఎఫ్ బకాయిలు జమచేయలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రమణారెడ్డి, వెంకటరామిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, అన్వర్‌బాషా, శేషారెడ్డి, సీతారామరెడ్డి పాల్గొన్నారు.

వీధిలైట్లకు పగలే వెన్నెలాయే..!



దువ్వూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు గ్రామ పంచాయతీ పరిధిలో పట్టపగలు వీధిలైట్లు వెలుగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. కరెంటు బిల్లులు భారీగా వస్తున్నా గ్రామ పంచాయతీ వారికి ఇంత నిర్లక్ష్యమెందుకు? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈవిషయంపై విద్యుత్ శాఖ ఏఈ రాజకుమార్‌ను సంప్రదించగా వీధిలైట్లు పగలు వెలుగుతున్న మాట వాస్తవమేనన్నారు. గ్రామ పంచాయతీ వారు వచ్చి అడిగితే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఖాజీపేటలో 23.6 మి.మీ. వర్షం

ఖాజీపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో శనివారం 23.6 మి.మీ. వర్షాపాతం నమోదు అయిందని తహసీల్దారు ఏవీ రమణమ్మ తెలిపారు. వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. పాత మిద్దెలుకానీ, పాత కొట్టాలులో నివశించేవారు జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు.

అలరించిన చిన్నారుల వేషధారణలు


పోరుమామిళ్లలోని వైష్ణవి స్కూల్‌లో శ్రీకృష్ణ వేషధారణలో చిన్నారులు

పోరుమామిళ్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలం లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల సందర్భంగా శనివారం పోరుమామిళ్లలో వైష్ణవి హైస్కూలులో కరస్పాండెంట్ రామక్రిష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్నారుల వేషధారణలు ఆహుతులను అలరించాయి. అనంతరం చిన్నారులు నృత్య ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రామక్రిష్ణ , ప్రిన్సిపాల్ కళ్యాణి, మాట్లాడుతూ హిందువులకు శ్రీకృష్ణుడు ఆరాధ్య దైవమని పేర్కొన్నారు. దుష్టశిక్షణ, శిష్ట రక్షణలో భాగాంగా అధర్మంగా హింసాయుతంగా పాలన సాగించే రాక్షసులను సంరక్షించి శ్రీకృష్ణుడు ధర్మాన్ని నిలబెట్టాడని పేర్కొ న్నారు. విద్యా ర్థులకు పండుగ విశిష్టతను తెలిపారు. అనంతరం శ్రీకృష్ణ గోపికల వేషాలు వేయించి ఉట్టికుండను కొట్టించారు. కార్యక్రమంలో ఫౌండరు రామాం జులు, వైస్ ప్రిన్సిపాల్ నమిత పాల్గొన్నారు. అలాగే వేణుగోపాలస్వామి ఆలయం లో ఆలయ ధర్మకర్త పెసల నరసింహులు ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించి కల్యాణమహోత్సవం నిర్వహించారు.

చేనేత క్లస్టర్లపై విచారణ జరిపించాలి

జమ్మలమడుగు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గంలో చేనేత క్లస్టర్లపై అధికారులు విచారణ జరిపించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం జమ్మలమడుగులో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేనేతలకు ప్రతిష్టాత్మకంగా వారి ఆర్థిక అభివృద్ధి కొరకు చేనేత దినోత్సవం పురష్కరించుకుని చేనేత క్లస్టర్లకు నిధులు విడుదల చేసిందన్నారు. అందులో లక్షల రూపాయలు క్లస్టర్ నిర్వాహకులు దోచుకోవడం జరిగిందన్నారు. వాటిపై సమగ్ర విచారణ జరిపించి అవకతవకలకు పాల్పడి చేనేతలకు అందకుండా స్వాహా చేసిన చేనేత క్లస్టర్ల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రాంప్రసాద్, రాజేంద్ర, నాగేంద్ర పాల్గొన్నారు.

టీడీపీ నేతకు డీసీసీబీ చైర్మన్ పరామర్శ

అట్లూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు మాజీ మండల అధ్యక్షుడు బోవిళ్ల రామక్రిష్టారెడ్డిని డీసీసీబీ చైర్మన్ మంచూరిసూర్యానారాయణరెడ్డి శనివారం ఆయన నివాసంలో పరామర్శించారు. రామక్రిష్టారెడ్డికి ఇటీవలగుండెకు చికిత్స జరగడంతో ఆయన ఆరోగ్య స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో మండల టీడీపీ సీనియర్ నాయకుడు బోవిళ్ల నందగోపాల్‌రెడ్డి, అధ్యక్షుడు మల్లిఖార్జునరెడ్డి, ఇన్‌చార్జ్ రెడ్డయ్య, నరసింహారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అయ్యవారయ్య, గురుప్రసాద్‌రెడ్డి, నరసారెడ్డి ఉన్నారు.


కమనీయం.. కొండ వేణుగోపాలస్వామి కల్యాణం


రుక్మిణీ, సత్యభామ గోపాలస్వామి కల్యాణం తిలకిస్తున్న భక్తులు


విగ్రహాలను గోపాలస్వామి కొండకు తీసుకెళుతున్న భక్తులు

అట్లూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అట్లూరు మండలంలోని కొండూరు పడమటిభాగం లంకమల అభయారణ్యంలో వెలసిన మూలవిరాట్ కొండగోపాలస్వామి ఆల యంలో శ్రావణమాస శనివారాలు పురస్కరించుకుని ఆలయ ధర్మకర్త బి.నందగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా, కమనీయంగా నిర్వహించారు. కడప, అన్నమయ్య, నెల్లూరు చిత్తూరు తిరుపతి జిల్లాల నుంచి గోపాలస్వామి కొండపైకి భక్తులు వెళ్లి అక్కడ గుడి పక్కన ఉన్న జలపాతంలో స్నానాలు ఆచరించి కొండ గొపాలస్వామికి భక్తిశ్రద్దలతో పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాటూరు రాధాక్రిష్టారెడ్డి, సింగనపల్లెసుబ్బారెడ్డి, పాలకొండ గోపాల్‌రెడ్డి, బోవిళ్లరాజ గోపాల్‌రెడ్డి, బంగారు అంగడి వెంకటేశ్వర్లు కొండలోనిర్వహించే సాంస్కృతిక కార్యక్ర మాలు, అన్నదాన కార్యక్రమాలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా భక్తులకు అన్ని సదుపాయాలు సమకూర్చడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రాత్రికి రుక్మిణీ సత్యభామ వేణుగోపాలస్వామిని రథంపై అలంకరించికోలాటలాధ్య గ్రామోత్సవం నిర్వహించారు..

లక్ష్మీనరసింహుడికి శ్రావణమాస పూజలు


అలంకరంలో లక్ష్మీనరసింహుడు

బద్వేలు రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వల్లెరవారిపల్లె గామంలో వెలసిన స్వయంభూ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం శ్రావణమాస నాలుగో శనివారం పురస్కరించుకుని విశేషపూజలు, అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి వెండి ఆభరణాలతో పలు రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణచేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు పెంచలయ్యస్వామి మాట్లాడుతూ ఈ నెల 23న శ్రావణ అమావాస్య పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజాభిషేకాలు, అలాగే శాకాంబరి అలంకారంలో స్వామివారి దర్శనం ఉంటుందన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కైంకర్యం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు


అభయ ఆంజనేయస్వామిని దర్శించుకున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

మైలవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జి.ఉప్పలపాడులో వెలసిన అభయ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాస శనివారం పురష్కరించుకుని అభయ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభయ ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక భక్తులేకాక ఇతర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కాగా వచ్చిన భక్తులకు వద్దిరాల మాజీ ఎంపీటీసీ నరసింహులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ట్యాంకర్లతో మంచినీరు సరఫరా

జమ్మలమడుగు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి వరద ఉధృతి అధికం కావడంతో మండల పరిధిలోని మోరగుడి గ్రామంలో మంచినీటికి ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయించారు. గత మూడు రోజులుగా పెన్నాకు పది టీఎంసీలకుపైగా నీరు విడుదల చేయడంతో పెన్నానది సమీప గ్రామాలలో పైపులు కొట్టుకునిపోయి మంచినీటి సమస్య ఏర్పడింది. అందులో భాగంగా శనివారం సాయంత్రం మోరగుడి గ్రామంలో వీధులకు ట్యాంకర్లతో భూపేష్‌రెడ్డి మంచినీటి సరఫరా చేయించారు. అలాగే పెన్నానది పరిసర ప్రాంతాల్లో ఉన్న కొన్ని గ్రామాలకు అంతంత మాత్రంగా నీటి సరఫరా జరుగుతోందని అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉచిత ప్రయాణానికి గుర్తింపు కార్డు ఉండాలి

బద్వేలు రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సు ప్రయాణానికి ప్రభుత్వంచే ఆమోదించిన ఏదైనా గుర్తింపు ఒరిజినల్ కార్డు తప్పకుండా మహిళలు వారి వెంట తెచ్చుకోవాలని ఆర్టీసీ డీఎం నిరంజన్ తెలిపారు. ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, ఓటరు ఐడీ, డ్రైవింగ్ లైసెన్సు, ప్రభుత్వం చేత గుర్తించబడిన ఇతర కార్డులు కూడా అనుమతిస్తారన్నారు. కార్డుపై స్థానికతను తెలిపే అడ్రస్ ఉండాలన్నారు. విద్యార్థులు అయితే పాఠశాలలో ఇచ్చిన ఐడీ కార్డు కూడా అనుమతిస్తారన్నారు.కేవలం ఒరిజనల్‌మాత్రమే చెల్లుబాటు అవుతుందని జిరాక్స్ కాపీని కానీ, సెల్‌ఫోనులో వారి గుర్తింపుకార్డుల ఫొటో కానీ చెల్లవని తెలిపారు. పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణం చేయవచ్చని, జీరో పెయిర్ టికెట్ ఇస్తారని తెలిపారు. ఇంద్ర, ఏసీ, సూపర్‌లగ్జరీ, అల్ట్రాడీలక్స్ ఇతర రాష్ట్రాలకు నడిపే బస్సు సర్వీసులను పథకం వర్తించదని తెలిపారు.

చంద్రబాబు, లోకేష్ గురించి మాట్లాడితే ఊరుకోం

● మాజీ ఎమ్మెల్యే రాచమల్లుకు ప్రవీణ్ హెచ్చరిక


విలేకర్లతో మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్ రెడ్డి

ప్రొద్దుటూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబును, మంత్రి లోకేశ్‌ను గురించి మాట్లాడితే ఊరుకోమని టీడీపీ మాజీ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డి తీవ్రంగా హెచ్చరించారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరులో చెల్లని రూపాయి రాచమల్లు అని అలాంటిది పులివెందులలో ఎలా చెల్లుతాడన్నారు. బ్యాలెట్ పేపర్లు అయితే 3వేల మెజారీటీతో గెలుస్తామన్న రాచమల్లు ఇప్పుడేమైందని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యం గురించి జాతిపిత మహాత్మా గాంధీ గురించి మాట్లాడే అర్హత నీకెక్కడిదన్నారు. పోలీసులను అడ్డంపెట్టుకోని ఐదేళ్ల మీ ప్రభుత్వంలో చేసిన దందాలు ఇంకా ప్రొద్దుటూరు ప్రజలు జిల్లా వాసులు మరిచిపోలేదని ప్రవీణ్ పేర్కొన్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి

మైదుకూరు రూరల్, ఆగస్ట్ 16(ఆంధ్రజ్యోతి) : సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగసుబ్బారెడ్డి పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక సీపీఐ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ నెల 23, 24, 25 తేదీలలో ఒం గోలులో జరిగే రాష్ట్ర మహాసభలకు కార్మికులు, ప్రజలు, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పొతిరెడ్డి బాస్కర్,షావల్లి, ఏవీ శివరాం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మైలవరం మండల సర్వసభ్య సమావేశం

మైలవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మైలవరం మండల సర్వసభ్య సమావేశం ఈనెల 18వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామచంద్రారెడ్డి తెలిపారు. సమావేశంలో తాగునీరు, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, వ్యవసాయం, వెలుగు తదితర అంశాలపై చర్చ జరుగుతుందని ఆయన తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.